

హైదరాబాద్ వార్త

## 'డబుల్' దరఖాస్తుల పరిశీలన

# అంతేనా..?



**ఇప్పటివరకు పూర్తయింది 50శాతమే**

**ఇంకా పెండింగ్‌లోనే 3లక్షలకు పైగా దరఖాస్తులు**

**చాలా చిరునామాల్లో దరఖాస్తుదారులు లేరంటున్న సిబ్బంది**

**ఫోన్లు సైతం కలవడం లేదంటూ గగ్గోలు**



హైదరాబాద్, నవంబర్ 27, ప్రభాతవార్త: డబుల్‌బెడ్‌రూం ఇళ్లకేటాయింపుల కోసం లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ దాదాపు సగం పూర్తయింది. మిగతా సగం త్వరగా పూర్తి చేసేందుకు యంత్రంగా చర్యలు చేపట్టింది. దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన వారం, పది రోజుల్లో పూర్తవుతుందని అధికారులు ముందు అంచనా వేసినప్పటికీ మూడు నెలల గడిచినా యాభైశాతమే పూర్తయింది. ఇందుకు ప్రధాన కారణం దరఖాస్తు దారుల్లో చాలామంది చిరునామాలు మారడటం. చిరునామాల్లో లేనివారికి ఫోన్లు చేసినా చాలామంది ఫోన్ నంబర్లు కలవడం లేదని అధికారులు చెబుతున్నారు. అయితే డబుల్ ఇళ్ల కోసం దరఖాస్తుచేసు కున్నప్పటికీ చిరునామాలో లేనివారికి ఫోన్లు చేసినా అధికారులు.. దరఖాస్తుదారుల ధ్రువీకరణ కోసం ఆధార్‌తో పాటు ఫోటో ఓటర్ గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు) జీరాక్స్‌లు కావాలని కోరుతున్నారు. ఇందుకు కారణం స్థానికులైన వారికే ఇళ్లకు కేటాయించాలని భావించిన ప్రభుత్వం అందుకుగానూ దరఖాస్తులు చేసుకున్న సమయానికి ఓటరు జాబితాలో పేరున్న వారిని స్థానికులుగా పరిగణించాలని భావిస్తున్నట్లు సమాచారం. అందుకు గానూ ఎపిక్ కార్డును అడుగుతున్నారు. అభ్యర్థులు ఇప్పటికే ఎక్కడైనా ఇల్లు పొందిఉంటే తెలుసుకునేందుకు, ఇతరత్రా వివరాలు కోసం ఆధార్ కోరుతున్నారు. రిజర్వేషన్లను కూడా అమలు చేసేందుకు కులం, మతం వివరాలు సైతం సేకరిస్తున్నారు. వీటన్నింటిని సేకరించేందుకు అసలు దరఖాస్తుదారులు ఎక్కడున్నారో గుర్తించడం కష్టమవుతుందని అధికారులు చెబుతున్నారు. చిరునామాల్లో లేనివారిని తొలుత ఫోన్ల ద్వారా కమ్యూనిటీహాల్‌కు వివరాలు సమర్పించేందుకు రావాలని కోరారు.

చాలామంది ఫోన్లు కూడా కలవకపోవడంతో మరో ప్రయత్నంగా దగ్గర్లోని జీహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్ కారాలయాల్లో సంప్రదించాలని ఇటీవల జిహెచ్‌ఎంసి పత్రికా ప్రకటన జారీ చేసింది. అయితే ఇప్పటివరకు డబుల్ ఇళ్లు కావాలని కోరుకుంటూ ఆన్‌లైన్‌ద్వారా ఆఫ్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నవారు 7.09లక్షలమంది ఉన్నారు. వాటిలో సగం దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని అధికారులు తెలుపుతున్నారు. అయితే ఇప్పటి వరకు డబుల్‌బెడ్‌రూం దరఖాస్తులు పూర్తయిన జోన్‌లలో కూకట్‌పల్లి జోన్ అగ్రస్థానంలో ఉందని ఈజోన్‌లో దాదాపు 1.30లక్షల దరఖాస్తులు రాగా.. వాటిల్లో 72శాతం పరిశీలన పూర్తయిందని అధికారులు పేర్కొంటున్నారు.

# నిత్యావసరాల్లో కల్తీమయం

**గోషామహల్ నియోజకవర్గంలోని ప్రధాన వ్యాపార వాణిజ్య కేంద్రాల్లో జోరుగా వ్యాపారం**

బేగంబజార్, నవంబర్ 27 ప్రభాతవార్త: గోషామహల్ నియోజకవర్గంలోని ప్రధాన వ్యాపార వాణిజ్య కేంద్రాలైన బేగంబజార్,కోల్సా వాడి తదిత ప్రాంతాలల్లో నిత్యావసర వస్తువుల్లో కల్తీ నిరాటంకంగా కొనసాగతున్నాయి. ఇంత జరుగుతున్న అధికారులలో చలనం లేకుండా పోతుందని ప్రజలు వాపోతున్నారు.కొందరి అధికారుల కళ్లు గప్పి నిత్యావసర వస్తువులైన కారంపొడి,పసుపు,నెయ్యి తదితర నిత్యావస వస్తువులను కల్తీ సరుకులుగా విక్రయిస్తున్నారు.కల్తీ వ్యాపారులకు కొందరు అధికారుల అడ్డదండలు ఉండటంతో వారికి అడ్డు అదుపు లేకుండా పోతుంది.మహానగరంలో కల్తీ నిత్యావసర సరుకులను విక్రయించే వారిని అడ్డు కట్ట వేసేందుకుగాను ఏర్పాటు చేసిన విజిలెన్స్, పుడ్స్ విభాగం నిర్లక్ష్యం చూసి చూడనట్లు వ్యవహరిస్తుంది. వారిపై కొరడా జులుపించడంతో ఘోరంగా విఫలం చెందుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. మహానగర పాలకసంస్థ హెల్త్ విభాగం అధికారులు, సిబ్బంది నిత్యావసర సరుకులను శాంపిల్స్ సేకరించి తీసుకు వెళ్లి (ఐపిఎంకి ఇస్తే) నిత్యావసర వస్తువులు కల్తీవా, లేదా కల్తీలేని వస్తువులుగా రుజువైవుతుంది. ప్రత్యేకించి కారంపొడిలో పిండి, చెక్కపొడి కలుపుతున్నట్లు జోరుగా ప్రజలనుంచి వినిపిస్తుంది.దీనికి తోడు పసుపులో కూడా పిండి కలుపుతున్నట్లు సర్వత్రా వినిస్తుంది.కల్తీ సరుకులు బేగంబజార్, కోల్సా వాడి, కిషన్‌గంజ్, మహారాజ్‌గంజ్‌లలో జోరుగా కొనసాగుతున్నాయి. జెండుబామ్, సబ్బులు, వంటనూనెల్లో పామోలియన్ పత్తి నూనెలను కలుపడం ద్వారా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. కల్తీ వసువులను తెలుసుకో వడం కూడ చాలా కష్టతరంగా మారుతుంది. దీంతో అటు వినియోగదారులు ఆర్థికంగా ఆరోగ్యకరంగా నష్టాలకు గురవుతున్నారు. అంతకంటే వంట నూనెల్లో జరుగుతున్న కల్తీ కారణంగా పెద్ద సమస్యలు వస్తున్నాయి.వంట నూనెల్లో కల్తీ మూలంగా జాండీస్, గ్యాస్ ట్రబుల్, ఎలర్జీలు వస్తున్నాయని ప్రజలు ఆవేధన వ్యక్తం చేశారు.

కల్తీ కారణంగా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వారిని కనిపెట్టడంలో విజిలెన్స్ వర్గాలు విఫలం అవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంకా అనేక రకాల కల్తీ వస్తువుల భారీన పడుతున్నారు. అక్రమ వ్యాపారులతో అధికారులు మిలఖత్ అవుతుండం మూలంగా కల్తీ నిత్యావసర సరుకులకు అడ్డు అదుపు లేకుండా పోతున్నట్లు ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని కల్తీ నిత్యావసర సరుకులను అరికట్ట వలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

# పార్టీలో కష్టపడ్డ వారికి సముచిత స్థానం

**టిఆర్ఎస్‌ను జాతీయ పార్టీగా ప్రకటించడంతో బిజెపిలో భయం**

**అందుకే తమ వద్ద ఉన్న వ్యవస్థలతో భయపట్టే ప్రయత్నం**

**జిల్లా టిఆర్ఎస్ జనరల్‌బాడీ మీటింగ్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మంత్రి తలసాని, మహమూద్‌అలీ

హైదరాబాద్, నవంబర్ 27,ప్రభాతవార్త: రాష్ట్రంలో మరో 20ఏండ్ల వరకు ముఖ్యమంత్రి కెసిఆర్ నాయత్వంలోని టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉంటుందని రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఈమేరకు ఆదివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన హైదరాబాద్ జిల్లా టిఆర్ఎస్ పార్టీ జనరల్ భాడీ సమావేశంలో ముఖ్యఅతిధిగా మంత్రి పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా అత్యధిక సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలువుతున్నాయని చెప్పారు. పార్టీలో ఉన్న నాయకులు, కార్యకర్తల గౌరవాన్ని పెంపొందించే విధంగా టిఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం లభిస్తుందని, వివిధ పదవుల్లో అవకాశం కల్పించి తగిన గౌరవాన్ని కల్పిస్తుందన్నారు. టిఆర్ఎస్‌ను జాతీయ పార్టీగా ప్రకటించడంతో బిజెపిలో భయాందోళన మొదలైందని, అందుకోసమే అనేక రకాల కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నాం కదా అని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తనవద్ద ఉన్న వ్యవస్థలతో భయాందోళనకు గురిచేసే ప్రయత్నం చేస్తుందని ధ్వజమెత్తారు. మీతాటాకు చప్పుళ్లకు భయపడభోమని, మిమ్మల్ని ప్రజాక్షేత్రంలో దోషులుగా నిలబెట్టే రోజు దగ్గరల్లోనే ఉందన్నారు. అన్ని నియోజకవర్గాలల్లో టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అత్మీయ సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే టిఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయని, తిరిగి అధికారంలోకి వస్తామని అన్నారు. తాము ఏం చేశామో ప్రజలకు చెప్పగలమని, మీరేం చేశారో చెప్పే ధైర్యం బిజెపికి ఉందా అని ప్రశ్నించారు. ఈసమావేశంలో హోంమంత్రి మహమూద్‌అలీ, ఎమ్మెల్సీలు ప్రభాకర్‌రావు, సురభి వాణిదేవి, ఎమ్మెల్యేలు మాగంటి గోపినాథ్, ముఠాగోపాల్, దానం నాగేందర్, కాలేరు వెంకటేష్, సాయన్న, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ తలసాని సాయి కిరణ్‌యాదవ్, కార్పొరేషన్ చైర్మన్లు రావుల శ్రీధర్‌రెడ్డి, గజ్జెల నగేష్, నాయకులు దాసోజు శ్రావణ్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ ప్రసన్న, పలు నియోజకవర్గాల ఇంచార్జ్‌లు ,కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## క్రికెట్ ఆడేందుకు వచ్చి..

# ప్రాణాలు కోల్పోయిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

బేగంపేట నవంబరు 27,ప్రభాతవార్త : సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో మిత్రులతో కలిసి సరదాగా క్రికెట్ ఆడేందుకు వచ్చిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆటలో అస్వస్థతకు గురై ప్రాణాలు కోల్పోయిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా కనిగిరి మండలం పునుగోడు గ్రామానికి చెందిన మాలపాటి సంజీవ్(31),గచ్చిబౌలిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. నగరంలోని సనత్ నగర్ సౌభాగ్యనగర్ లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 26వ తేదీన సాయంత్రం గం 4.30నిల సమయంలో సంజీవ్ అతని స్నేహితుడు మాధవ్ రెడ్డితో కల్సి క్రికెట్ ఆడేందుకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌కు చేరుకున్నారు.క్రికెట్ ఆడుతున్న సమయంలో అతను అస్వస్థతకు గురయ్యాడు.ఇది గమనించిన అతని స్నేహితులు సంజీవ్ ను ఆటోలో కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఇదే విషయాన్ని వారు సంజీవ్ సోదరుడైన మాలపాటి పవన్‌కు ఫోన్ ద్వారా తెలియజేసారు. సంజీవ్ ను పరిక్షించిన వైద్యులు అతను మృతి చెందినట్లు సమాచారం ఇచ్చారు. మృతునికి 2020లో మాధురి అనే మహిళతో వివాహం జరిగింది.మృతుని సోద రుడు పవన్ ఫిర్యాదు మేరకు ఎస్సై జయచందర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**సైబర్ నేరగాళ్ల చేతి వాటం**

## క్రెడిట్ కార్డు బ్లాక్ చేయమంటే..

# నగదు మాయం చేశారు

బేగంపేట నవంబరు 27, ప్రభాతవార్త : సైబర్ నేరగాళ్ల మాయలో పడి పైసలు పొగొట్టుకోవద్దు. వారు అడిగిన వెంటనే మెబైల్ కు వచ్చే ఓటీపీ చెప్ప వద్దని,పలు రకాలుగా వారు ప్రజలను మోసగిస్తున్నారని,అనుక్షణం అప్రమత్తంగా ఉండాలంటూ పోలీసులు నిత్యం సూచనలు చేస్తూ జాగ్రత్తలు చెపుతున్నప్పటికీ ప్రతి రోజు పదుల సంఖ్యలో సైబర్ మోసగాళ్ల వలలో చిక్కి పైసలు పొగొట్టుకుంటూనే ఉన్నారు. ఇలాంటి ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.బేగంపేట పాటిగడ్డ ఎన్‌బిటి నగర్‌కు చెందిన గజం సిద్దయ్య ప్రయివేటు ఉద్యోగి.ఇతనికి స్టేట్ బ్యాంకులో 4207399105760432 కార్డు లిమిట్ రూ 1,35,000లు, 4611199395853982 కార్డు లిమిట్ రూ10,000లు రెండు క్రెడిట్ కార్డులు ఉన్నాయి.రెండింటిలో ఒక కార్డు బ్లాక్ చేయాలని ఈ నెల 17వ తేదీన మధ్యాహ్నం గం 12.15 నిలకు హెల్ప్‌లైన్ కు కాల్ చేసాడు.అయితే ఇది గమనించిన సైబర్ నేరగాడు +919883482422 నెంబరు నుంచి సిద్దయ్యకు కాల్‌చేసి రెండు క్రెడిట్ కార్డుల వివరాలు చెప్పాలని,ఓటీపీ కూడా వస్తుందని వెంటనే చెప్పాలని చెప్పించుకున్నాడు. 20నిమిషాలలో కాల్ డిస్‌కనెక్ట్ అయింది. కొద్ది సేపటి తర్వాత మొబైల్ నుంచి రూ 49,999లు,రూ 25,000లు, రూ701లు, రెండవ కార్డు నుంచి రూ 9500లు మొత్తం రూ 85,200లు నగదును సైబర్ నేరగాళ్లు కాజేశారు.ఈ విషయాన్ని గుర్తించిన సిద్దయ్య వెంటనే సైబర్ క్రైమ్స్‌లో ఫిర్యాదు చేసారు. ఆ తరువాత ఎన్ని సార్లు కాల్ చేసినా ఆ నెంబరు కలవ లేదన్నారు. బాధితుడు గజం సిద్దయ్య ఫిర్యాదు మేరకు ఇన్స్‌పెక్టర్ పి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నృత్యవిన్యాసాలతో భారతనాట్యాలయ 75వ వార్షికోత్సవం



కళాకారుల నృత్యప్రదర్శనలోని దృశ్యం

రవీంద్రభారతి, నవంబరు 27 ప్రభాతవార్త : ప్రముఖ శాస్త్రీయ నృత్యశిక్షణా సంస్థ భారత నాట్యాలయ 75వ వార్షికోత్సవ వేడుకలు రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో సంస్థ కళాకారుల వివిధ అద్భుత నృత్య విన్యాసాలతో అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రఖ్యాత నాట్యగురువు రుక్మిణి శ్రీనివాసన్ 1947లో ఈ సంస్థను స్థాపించగా ఆమె కుమార్తె ప్రముఖ నృత్యగురువు చిత్రనారాయణ్, మను మరాలు గురువు లత రవి, ముని మనువరాలు రమ్య సురేష్, సుప్రసన్న శ్రీనాథ్‌లతో సహకారంతో గత 75 సంవత్సరాలుగా ఎంతోమంది అద్భుత కళాకారులను ప్రపంచానికి అందించడంతోపాటు ఎన్నో విలక్షణమైన కార్యక్రమాలను నిర్వహిస్తూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, శాస్త్రీయ నృత్యాలను విశ్వవ్యాప్తం చేయడంలో ముందు వరుసలో ఉందని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ప్రముఖ టీవి యాంకర్ సుమ కనకాల, డా. జయంతిరెడ్డి, ఆశ్రిత వేముగంటి తదితరులు జ్యోతిప్రకాసనంచేసి నృత్యప్రదర్శనలను లాంఛనంగా ప్రారంభించి ప్రసంగిస్తూ అన్నారు. అనంతరం సంస్థకు చెందిన అనేకమంది కళాకారులు వివిధ అంశాలతో శాస్త్రీయ నృత్యప్రదర్శనలు కావించి ఆహుతులను మంత్రముగ్ధులను చేశారు.

## డబుల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయింపులో

# తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యం

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



అడ్డగుట్టలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

అడ్డగుట్ట, నవంబర్ 27 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చెందుతుందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం అడ్డగుట్ట డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో వివిధ శాఖల ఉన్నతాధికారుల తో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడ్డగుట్టలో రోడ్లు, డ్రైనేజీ మంచినీరు వంటి సమస్యలు అస్తవ్యస్థంగా ఉన్నాయని స్థానికులు తన దృష్టికి తెచ్చినట్లు అయన తెలిపారు. అదే విధంగా డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు కేటా యించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. అడ్డగుట్ట కమ్యూనిటీ హాల్ నుంచి తుకారాంగేట్ మీదుగా లాలాపేట్ మీదుగా నిర్వహించిన ఈ పాదయాత్రకు అనూహ్యస్పందన లభించింది. తుకారాంగేట్‌లో ఓ కూరగాయల వ్యాపారి వద్దకు వచ్చి వారి సాదక బాధకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్ర మంలో జలమండలి జనరల్ మేనేజర్ రమణారెడ్డి, జిహెచ్‌ఎంసి సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ దశరత్, గ్రేటర్ మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు మేకల సారంగపాని, బండపల్లి సతీష్, ఆలుగడ్డ శ్రీనివాస్‌లతో పాటు అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన బిజెపి సీనియర్ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో అందుబాటులో రాగినాణెం, క్యాలెండర్లు



బేగంపేట నవంబరు 27,ప్రభాతవార్త : సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో భక్తుల కోరిక మేరకు అమ్మ వారి రాగి నాణేలు, అమ్మవారి నూతన సంవత్సరం క్యాలెండర్‌ను అందు బాటులోకి తీసుకు వచ్చినట్లు ఆలయ ఈఓ అసిస్టెంట్ కమిషనర్ గుత్తా మనోహర్ రెడ్డి తెలియజేసారు. రాగి నాణేనికి ఒకవైపు అమ్మ వారు రూపం, మరోవైపు శ్రీచక్రం ఉంటుందన్నారు. అలాగే అమ్మవార్ల ఫోటోతో ఉన్న నూ తన సంవత్సరం క్యాలెండర్ కూడా ఆలయంలోని కౌం టర్లలో భక్తులకోసం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

## సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ఘట్‌కేసర్, నవంబర్ 27, ప్రభాతవార్త: సీఎం సహయనిధితో పేదలకు వైద్య ఆర్థిక సాయం అందుతుందని మున్సిపల్ 5వ వార్డు కౌన్సిలర్ కొమ్మిడి అనురాధ రాఘవరెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ 5వ వార్డులోని సాయినగర్‌కాలనీలో ఆదివారం లబ్దిదారుకు సీఎం ఆర్‌ఎఫ్ చెక్కును అమె అందజేశారు. కాలనీకి చెందిన మౌనిక ఇటీవల అనార్యోగంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకోగా బిల్లు అధికం కావడంతో ముఖ్యమంత్రి సహాయనిధి పథకానికి ధరఖాస్తు చేసుకుంది. మంత్రి మల్లారెడ్డి సహకారంతో రూ.60 వేలు సిఎం ఆర్‌ఎఫ్ ద్వారా మంజూరు కాగా ఆమెకు అందించారు. స్థానిక కౌన్సిలర్ అనురాధ స్థానిక నాయకులతో కలిసి సాయినగర్‌లోని మౌనిక ఇంటికి వెళ్లి రూ.60 వేలు సిఎం ఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా ప్రజలకు ఆర్థిక ంగా మేలు కల్గించేలా చర్యలు తీసుకుంటుందని ఆమె పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో 5వ వార్డు టిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు పొత్కని మల్లికార్జునరాజు, కొమ్మిడి ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి దేవాలయ నిర్మాణంపై సమావేశం

కొడంగల్, నవంబర్ 27ప్రభాతవార్త : కొడంగల్ పట్టణ శివారులోని బండల ఎల్లమ్మ దేవాలయ సమీపంలో అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి సంభందించి ఆదివారం స్థానిక రాఘవేంద్ర ఫంక్షనప్‌హాల్‌లో పట్టణవాసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.సమావేశంలో వైద్యులు రవీంద్ర యాదవ్, మాజీ ఎంపీపీ దయాకర్‌రెడ్డిల అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో నూతనంగా నిర్మించనున్న ఆలయానికి సంభందించి ఏర్పాట్లపై చరి ్చంచారు.అలాగే ఆలయ నిర్మాణానికి సంభందించి వ్యయంతో పాటు విరాళాల సేకరణ తదితర అంశాలపై భక్తులను అడిగి తెలుసుకున్నారు.డిసెంబర్ 8న ఆలయ నిర్మాణం భూమిపూజతో పాటు డిసెంబర్ 11న అయ్యప్పస్వామి మహాపడిపూజ నిర్వహణకు సంభందించిన అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఆలయ నిర్మాణానికి భక్తులు స్వచ్చందంగా ముందుకు వచ్చి తమవంతు సహాయ సహకారాలు అందించాలని తెలిపారు.ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులు ఉమాపతిగౌడ్,శ్రీనివాస్‌గౌడ్, కానుకుర్తి నర్సి రెడ్డి,కట్కం శివకుమార్‌గుప్త,మధుసుదన్ రావుయాదవ్, మురారి వశిష్ట,అచ్చుతారెడ్డి,అనంద్‌లాహోటీ,కిషన్ ధాగ, క్రిష్ణయాదవ్, కిట్టుస్వామి, నందారం రాజు, గోపాల్, రాకేష్, శేఖర్, బాలరంగాచారీ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగంతోనే ప్రజలకు సమాన హక్కులు

ఘట్‌కేసర్, నవంబర్ 27, ప్రభాతవార్త: భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అగ్రగామి అని టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి-మేడ్చల్ జడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 85వ వారం నిత్యపూలమాల కార్యక్రమం నిర్వహించారు. హరివర్ధన్‌రెడ్డి ముఖ్య అతిధిగా విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. ఈసందర్బంగా పిబిఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త ఎం.అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన భారత రాజ్యాంగ దినోత్సవంలో రాజ్యాంగ పీఠికపై నాయకులు ప్రతిజ్ఞ చేశారు. అంబేద్కర్ పరిశోధనలు చేసి రూపొందించిన భారత రాజ్యాంగం 1949 నవంబర్ 26 నుంచి అమలులోకి వచ్చిందని హరివర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలో ప్రజలకు సమానత్వం, లౌకికత్వం, కులమతాలకు అతీతంగా జీవించాలని రాజ్యాంగఫలాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులకు చేరాలని అంబేద్కర్ ఆకాంక్షించారని తెలిపారు. అంబేద్కర్ సంఘం అధ్యక్షులు మేకల దాసు, మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, పోచారం మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అంజనేయులు, ముత్యాలుయాదవ్, ఆనంద్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్, బద్రి, సంజీవరెడ్డి, నర్సింగ్‌రావు, బలరాం, అనిల్, విష్ణు, భరత్‌కుమార్, నితిన్ పాల్గొన్నారు.

## బస్‌షెల్టర్ నిర్మాణ పనుల పరిశీలన

కొడంగల్, నవంబర్ 27ప్రభాతవార్త : కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని కోస్గీ రోడ్డులో గల బాలుర వసతి గృహం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న బస్‌షెల్టర్ నిర్మాణ పనులను మున్సిపల్ కౌన్సిలర్‌లు మధుసుదన్ యాదవ్,రహేత్‌బేగం,మాజీ సర్పంచ్ రమేష్‌బాబు తదితరులు పరిశీలించారు.రూ.15లక్షల వ్యయంతో చేపట్టిన నిర్మాణ పనులను వారు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతు ఎమెమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సహకారంతో బస్‌షెల్టర్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. బాలాజీనగర్, ఆర్యనగర్ ప్రాంతానికి చెందిన ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌షెల్టర్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు.పనుల్లో వేగవంతంగా చేపట్టి నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను వారు ఆదేశించారు.ఈ సందర్బంగా కాలనీ వాసులు దస్తప్ప, తెరాసా నాయకులు పాల్గొన్నారు.

## రోడ్ల వెడల్పులో ఎందుకు ఆలసత్వం : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



కళ్యాణ్‌నగర్ వెంచర్ త్రీలో సంక్షేమ సంఘం సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

యూసుఫ్‌గూడ, నవంబర్ 27, ప్రభాతవార్త : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి జూబ్లిహిల్స్ నియోజకవర్గంలోని పలు డివిజన్‌లలో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. బోరబండ సైట్ 3 నుంచి పాదయాత్రగా బస్తీల కాలనీలలో ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బోరబండలో ఎన్నో ఏళ్ళుగా కొనసాగుతున్న కూరగాయల మార్కెట్‌ను తొలగించడంతో చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని దానిని తొలగించడానికి గల కారణాలను తెలుసుకున్నారు. అదేవిధంగా వినాయక నగర్‌లలో ప్రభుత్వ పాఠశాల వద్ద గదులను తొలగించారని ఇప్పటివరకు దానిని ఇనంచడక పోవడం పట్ల కారణాలు తెలుసుకున్నారు. బోరబండ సైట్ 3నుంచి బోరబండ పంక వరకు రోడ్డు వెడల్పు విషయంలో ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. సారది కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్రాంతంలో రోడ్డు ప్రక్కన ఏర్పాటుచేసుకున్న గుడిసె వాసులకు డబుల్ బెడ్ రూం ఇళ్ళు ప్రభుత్వం అందేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎర్రగడ్డ జనప్రియ మెట్రో పోలీస్ క్లాసిక్ హోమ్స్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజల సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని వారందరికి తగిన విధంగా సమస్యలు పరిష్కరించే దిశగా తాము కృషిచేస్తామని పేర్కొన్నారు. పాదయాత్ర మొదలయినప్పటినుంచి చివరి వరకు బిజేపి నాయకులు కార్యకర్తలు ఎంతో హుషారుగా పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ బిజేపి అధ్యక్షులు గౌతమ్‌రావు, జూబ్లిహిల్స్ నియోజకవర్గం బిజేపి ఇన్‌చార్జ్ లంకల దీపక్‌రెడ్డి, జూబ్లిహిల్స్ నియోజకవర్గం కన్వీనర్ కుంబాల గంగరాజు, డిఎమ్‌సి రమేష్, వెంకటేష్, శ్రీనువాస్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, అట్లూరి రామకృష్ణ, గూడురి శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తిచేయాలి


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పోరేటర్ చీరె సుచిత్రా శ్రీకాంత్

**కార్పోరేటర్ చీరె సుచిత్రా శ్రీకాంత్**

బేగంపేట నవంబరు 27, ప్రభాతవార్త : రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇటీవల కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగ వంతంగా పూర్తి చేయాలని కార్పోరేటర్ చీరె సుచిత్రా శ్రీకాంత్ అధికారులను కోరారు. ఆదివారం డివిజన్ పరిధిలోని సెయింట్ ఆంటోనీస్ హైస్కూలు, కళాసిగూడ ప్రభుత్వ పాఠశాల, బాటనీ స్కూలు, బూరుగు విశ్వనాథం ప్రభుత్వ పాఠశాలల్లో సంబంధిత బూత్ లెవల్ అధికారులను కలిసి ఓటరు నమోదు కార్యక్రమం వివరాలను కార్పోరేటర్ తెల్సుకున్నారు. జీరా ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న కాంక్రీట్ రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం పాన్ బజార్‌లో అభిషేక్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. వెంకట్రావ్ నగర్‌లో జైన్ సమాజం ఆధ్వర్యంలో సుచిత్రాను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాలలో కార్పోరేటర్ తో పాటు డివిజన్ అధ్యక్షులు ఆకుల ప్రతాప్, ప్రధాన కార్యదర్శి నరేష్, మనోజ్ ఉపాధ్యాయ, హెచ్ శ్రీనివాస్, దుర్గా ప్రసాద్, సందీప్, శ్రీనివాస్‌గౌడ్, అభినవ్, శ్రీధర్ సాయికుమార్, ధన్‌రాజ్, ఆశా, కిరణ్, జయ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా ఏపీఎస్ఈబి రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళం



ఆత్మీసమ్మేళనంలో సన్మాన కార్యక్రమం

హైదరాబాద్, నవంబర్ 27, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ బోర్డు(ఏపీఎస్ఈబి) రక్షణవిభాగం రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయసమ్మేళనం ఉత్సాహం సాగింది. ఈమేరకు ఆదివారం ఖైరతాబాద్ మింట్‌కాంపౌండ్‌లోని టిఈఈయు- 1104 కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎలక్ట్రిసిటీ బోర్డు రక్షణ విభాగంలో 1972 - 79వరకు విధుల్లో చేరి పనిచేసిన ఉద్యోగులందరూ కుటుంబసమేతంగా హాజరయ్యారు. ఈసందర్భంగా మొదట తమతోపాటు పనిచేసి మరణించిన ఉద్యోగులకు నివాళ్లు అర్పించారు. అనంతరం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే కుటుంబాలతో కలిసి అక్కడే భోజనాలు చేశారు. ఈసందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులు దానయ్య, ఎం.జ్ఞానేశ్వర్, మహాదేవ్‌సింగ్ తదితరులు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎలక్ట్రిసిటీ రక్షణ విభాగంలో కలిసి పనిచేసిన తమ మిత్రులందరూ దాదాపు 170మంది ఉంటారని తామంతా ప్రతిఏడాది కలుసుకునే విధంగా ఆత్మీయసమ్మేళనాలను గత 10 సంవత్సరాలుగా నిర్వహిస్తామన్నారు. ఒక్కో ఏడాది ఒక్కోజిల్లా కేంద్రంలో నిర్వహిస్తుమని ఈసారి హైదరాబాద్‌లో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో టిఈఈయు -1104 నాయకులు కళ్లెం శ్రీనివాస్ రెడ్డి బాలకృష్ణ రిటైర్డ్ ఉద్యోగులు విద్యాపతిరావు, శేఖర్‌రెడ్డి, రత్నయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

## ధన్వంతరి ఉత్సవాల్లో డాక్టర్లకు సన్మానం

నిజాంపేట్, నవంబర్ 27 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్‌కు చెందిన డా.ఎమ్.ఆర్.ఎస్ రాజును ఆదివారం బిజేపి మెడికల్ సెల్ ప్రతినిధులు ప్రశంసా పత్రం, జ్ఞాపికలతో సత్కరించారు. బిజేపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన ధన్వంతరి ఉత్సవాలకు ముఖ్య అతిధిగా మాజీ మంత్రి డా.విజయరామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా బిజేపి నాయకులు మాట్లాడుతూ వైద్యరంగంలో కృషి చేసిన పలువురు వైద్యులను సన్మానించామన్నారు. అందులో భాగంగానే కోవిడ్ రెండవ దశ సమయంలో రెండు నెలలు ఉచిత కోవిడ్ ఐసోలేషన్ సెంటర్‌లో రెసిడెంట్ డాక్టర్‌గా సేవలందించిన డా.ఎం.ఆ ర్.ఎస్ రాజు చేసిన సేవలను గుర్తించి సత్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రామచంద్రారావు, బిజేపి రాష్ట్ర మెడికల్ సెల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఓటు నమోదు చేసుకోవాలి



తాతాచారి కాలనీలో ఓటర్ల నమోదు కార్యక్రమంలో పాల్గొన్న భాజపా నేత నెమలి ఆనంద్

బేగంపేట నవంబరు 27, ప్రభాతవార్త : ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని, తద్వారా వారి ఓటు హక్కును పొంద వచ్చని భాజపా నాయకుడు నెమలి ఆనంద్(నందూ) అన్నారు. ఆదివారం బేగంపేట డివిజన్ పరిధిలోని తాతాచారి కాలనీలోని కమ్యూనిటీ హాలులో జరుగుతున్న ఓటరు ఎన్‌రోల్ మెంట్ కార్యక్రమాన్ని ఆనంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా యవకులను తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు అనేది ప్రతి ఒక్కరికి ఆయుధం అని, ప్రతి ఒక్కరూ తప్పక ఓటు హక్కు పొందాలని సూచించారు. ఈ సందర్భంగా బిఎల్ఓ పుణ్యవతి, పద్మలతో మాట్లాడి ఓటర్ల నమోదు కార్యక్రమం జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నందూతో పాటు డివిజన్ ప్రధాన కార్యదర్శి మైసూర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## రెజ్లింగ్ క్రీడలను ప్రోత్సహించాలి : జంపనప్రతాప్


రెజ్లింగ్ అసోసియేషన్ సభ్యులను సన్మానిస్తున్న జంపనప్రతాప్

కంటోన్మెంట్, నవంబర్ 27 ప్రభాతవార్త: బోయిన్‌పల్లిలోని కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్‌లో కొనసాగుతున్న రెజ్లింగ్ దంగళ్‌ను ఆదివారం కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఛీఫ్ ప్యాట్రన్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ సందర్శించారు. రెజ్లింగ్ కోచ్ సాయిబాబా యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు తాము ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తామని జంపనప్రతాప్ తెలిపారు. ఈ సందర్భంగా రెజ్లింగ్ అసోసియేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన ఆంధ్రకేశరి గెలుచుకున్న సంతోష్‌ను అభినందించారు.

## సమస్యలను పరిష్కరించేందుకు కృషి


అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ సున్నంరాజ్‌మోహన్

పురానాపూల్, నవంబర్ 27ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తనశక్తి వంచన లేకుండా కృషి చేసున్నట్లు పురా నాపూల్ డివిజన్ మజ్లీస్ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్ తెలిపారు. డివిజన్ పరిధిలోని సివరేజ్ అభివృద్ధి పనులను ప్రారంభించి పనితీరును పరిశీలించారు. డివిజన్ పరిధిలోని అంచెలంచెలుగా అనేక అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐ గంగాప్రసాద్, మజ్లీస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గార్వీ ఉత్సవాలు


రాజీవ్‌గాంధీ నగర్‌లో గార్వి షరీఫ్ వేడుకల్లో అన్నదానం చేస్తున్న నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎమ్‌డి గౌసుద్దీన్, వార్డు కమిటి సభ్యులు సయ్యద్ రియాజ్

యూసుఫ్‌గూడ, నవంబర్ 27, ప్రభాతవార్త : రాజీవ్ గాంధీ నగర్‌లో గార్వి షరీఫ్ ఉత్సవాలలో నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎమ్‌డి గౌసుద్దీన్ పాల్గొన్నారు. స్థానిక వార్డు కమిటి సభ్యులు సయ్యద్‌రియాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గార్వి ఉత్సవాలలో పెద్ద సంఖ్యలో చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి ప్రజలు పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఎమ్‌డి గౌసుద్దీన్ అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అస్సు భాయ్, హైమద్, రఫీక్, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్, నవంబరు 27 ప్రభాతవార్త : విద్యుత్ మరమ్మ తులు కారణంగా ఈ నెల 28వ తేదీ సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలు వరకు పాతబస్తీలోని పెట్లాబూర్జు, పురానాపూల్, పిటిఙ, హుస్సేనీఆలం, మురళీనగర్, దూద్‌బౌలి, మూసాబౌలి, షాగంజ్, చౌక్, చేలాపుర, మెటర్నటీ హాస్పటిల్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చార్మినార్ సిబిడి ఎడిఇ అధికారులు తెలిపారు.

## అధికారుల సహాయంతో సమస్యల పరిష్కారం

బేగంపేట నవంబరు 27, ప్రభాతవార్త : బేగంపేట ఏసీపీ పృధ్వీధర్ రావును కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసారు. బేగంపేట లోని ఏసీపీ కార్యాలయంలో ఆయన్ను కలిసిన సదాకేశవరెడ్డి దుశ్శాలువాతో సత్కరించి పండ్లు అందించారు. ఈ సందర్భంగా సదా కేశవ రెడ్డి మాట్లాడుతూ అధికారుల సహకారం ఉంటే ప్రజా సమస్యల పరిష్కారం సులువు అవు తుందని అన్నారు. వారికి తమ సహాయ సహకారాలు అందించాలని పిలుపు నిచ్చారు. ఏసీపీని కల్సిన వారిలో అశోక్‌గౌడ్, జబ్బార్, చిన్నం పాండు, మణికంఠ, సైఫ్ ఉన్నారు.

## కాలనీ సమస్యలు పరిష్కరించాలి


ఎమ్మెల్యే వివేకానంద్‌కు సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్ ఆగం రాజు

నిజాంపేట్, నవంబర్27 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 17వ వార్డు కార్పొరేటర్ ఆగం రాజుముదిరాజ్ ఆదివారం ఎమ్మెల్యే కేపి వివేకానంద్‌ను తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాచుపల్లిలోని కౌసల్య కాలనీలోని ప్రైమ్ మెడోస్‌లో మంజీరా వాటర్ కనెక్షన్, సాయికృష్ణజా హిల్స్‌లో డ్రైనేజీ పనులు, మంజీర వాటర్ లైన్స్, వికాస్ స్కూల్ నుంచి మియాపూర్ డిపో వరకు నూతన రోడ్డు తదితర సమస్యలపై ఎమ్మెల్యేకు విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను త్వరలో పరిష్కరిచాలని ఆదేశాలు జారీ చేశారు.

## అయ్యప్ప నామస్మరణతో మారుమ్రోగిన బాచుపల్లి


అయ్యప్ప మహాపడి పూజలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

నిజాంపేట్, నవంబర్ 27 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలోని ఏపీఆర్ ప్రణవ్ ఎన్‌క్లేవ్‌లో నిర్వహించిన అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఆదివారం ముఖ్య అతిధిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్పస్వామి కరుణాకటాక్షాలు, దీవెనలు నియోజకవర్గ ప్రజలందిరిపై ఉండాలని కోరుకున్నానన్నారు. అనంతరం అయ్యప్ప స్వామి భజన కార్యక్రమంలో పాల్గొని స్వాములతో కలిసి అయ్యప్ప భక్తి పాటలలో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, నిజాంపేట్ బిజేపి అధ్యక్షుడు ఆకుల సతీష్, కాలనీ అసోసియేషన్ సభ్యుడు ప్రదీప్ భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

## కళలను, కళాకారులను కేంద్రం ప్రోత్సహిస్తుంది : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


బోయిన్‌పల్లి ఎన్ఐఎంహెచ్‌లో నిర్వహించిన వందే భారతం నిత్య ఉత్సవ్‌లో ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

కంటోన్మెంట్, నవంబర్ 27 ప్రభాతవార్త: రోజు రోజుకు నిర్వీర్యం అవుతున్న కళలను, కళాకారులను కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సహిస్తుందని కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. వందే 2023 భారతం నిరిత్య ఉత్సవ్ పోటీలు ఆదివారం బోయిన్‌పల్లిలోని ఎన్ఐఎం.హెచ్. ఆడిటోరియంలో నిర్వహించిన సోలో, జానపద, గిరిజన కూచిపూడి, నృత్య కళాపోటీల వేడుకలకు అయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మన దేశంలో వివిధ కళలను ప్రోత్సహిస్తుందన్నారు. నృత్య, సంగీతం, కళారంగాల పోటీల్లో 17 నుంచి 31 సంవత్సరాల వయసులో ఉన్న వారు ఈ పోటీలలో పాల్గొనాలన్నారు. వచ్చే జనవరిలో గణతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఢిల్లీలో ఈ పోటీలు ఫైనల్‌కు చేరుకుంటాయన్నారు. అదే విధంగా మణిపూర్‌లో ఇటీవల నిర్వహించిన 33 గిరిజన తెగల జీవన విధానం, కళలు అద్భుతంగా నిర్వహించారన్నారు. దేశ సరిహద్దుల్లో ఉన్న ఇతర దేశాలకు చెందిన కళాకారులకు ప్రోత్సహిస్తున్నామన్నారు. డిసెంబర్ 1 నుంచి 2023 నంబర్ 30 వరకు వందేభారతంలో భాగంగా నృత్య, జానపద, కళా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోని 55 నగరాల్లో జీ 20 దేశంలో 250 ససమావేశాలు నిర్వ హించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో దక్షిణ మధ్య సాంస్కృతిక శాఖల డైరెక్టర్ కిరణ్ వాకర్, మేజర్ పి.వి.రామ్‌కుమార్, రక్షణ శాఖ డిప్యూటీ సెక్రటరీ రాజేందర్, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామక్రిష్ణ, వికలాంగుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్ రావ్ తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛతీష్‌ఘడ్, మహారాష్ట్ర నాగపూర్ రాష్ట్రాలకు చెందిన 600 మంది కళాకారులు పాల్గొన్నారు. ఆడిటోరియంలో ప్రదర్శించిన పలు వివిధ రకాల కళా బృందాలను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తిలకించారు.

## అన్నివర్గాల వారికి సంక్షేమం

**గడ్డం శ్రీనివాస్‌యాదవ్**


టిఆర్ఎస్ ఆత్మీయ సమేళ్ళనంలో టిఆర్ఎస్ నాయకులు గడ్డంశ్రీనివాస్‌యాదవ్

అఫ్జల్‌గంజ్, నవంబర్ 27ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అన్నివర్గాల సంక్షేమానికి తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ అనే సంక్షేమ పథకాలను దక్కే విధంగా అమలు చేస్తున్నట్లుగోషామహల్ నియోజకవర్గం టిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం జరిగిన సమ్మేళనం కార్యక్రమంలో ఆయన టిఆర్ఎస్‌నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు.

## 9 బస్తీల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక


ఒయూ 9 క్యాంపుల నూతన కమిటీ సభ్యులు

తార్నాక, నవంబర్ 27 ప్రభాతవార్త: చారిత్రక ఉస్మానియా యూనివర్సిటీ 9 బస్తీల వెల్ఫేర్ అసోషియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష్యులుగా ఎ.ఆనందర్, ఉపాధ్యక్షులుగా బి.సుధాకర్, బాబా బాయ్, వర్కింగ్ ప్రసిడెంట్ గా సీనియర్ టీఆర్ఎస్ నాయకులు జింకల మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా ఎండి.ఖలీద్, సంయుక్త కార్యదర్శిగా రవికుమార్, ఎండి.ఉమర్, ఆర్గనైజింగ్ సెక్రటరీటీ ఎస్.శ్రీనివాస్, కోషాదికారిగా కె.శ్రీహరి, సలహాదారులుగా బల్వంత్, యాఖుబ్ షరీఫ్, ఖాజా పాష, ఎండి లాయక్ అలి, ఎండి, షాబెర్, సెక్రటరీలుగా కుద్దూస్, రమ్మోహన్, షేక్ మక్బూల్, ఎండి అక్బర్, కనకరాజు, ఆశం, సభ్యులుగా ఇర్షద్, ఉమర్, బాల నర్సింహ్మా, కొండయ్య, ఆర్. శ్రీనివాస్ తధితరులను ఎన్నుకున్నారు. బస్తీవాసులందరికి డబుల్ బెడ్ రూం ఇండ్లు వచ్చేవరకు కృషి చేస్తామని కమిటీ పేర్కొంది. 9 క్యాంపుల బస్తీ వారికి విద్యుత్ కమర్షియల్ బిల్లులు వస్తుండటంలో తాము తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు.

## ఒయూలో ముదిరాజ్‌ల చరిత్ర సంస్కృతిపై సదస్సు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బండప్రకాష్, చిత్రంలో అడప సత్యనారాయణ తదితరులు

తార్నాక, నవంబర్ 27 ప్రభాతవార్త: ముదిరాజ్ కులస్తులు ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని ఎమ్మెల్సీ బండ ప్రకాష్ పేర్కొన్నారు. ముదిరాజ్ మహాసభ ఆద్వర్యంలో ఓ.యూ ఐసీఎస్ఎస్ఆర్ హాల్లో ముదిరాజ్‌ల చరిత్ర, సంస్కృతిపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ డా. బండ ప్రకాష్ మాట్లాడుతూ సమాజంలో ఉన్నతంగా ఎదిగిన వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని సూచించారు. ముదిరాజ్ కులస్థుల్లో ఐక్యత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా, ఆర్థికంగా, వృత్తి పరంగా, విద్యా, ఉపాదిపై చర్చజరుగాల్సిన అవసరం ఉందన్నారు. తమ కులస్థులు ఎంతో వెనుకబడి ఉన్నారని అందుకోసం దేశ వ్యాప్తంగా ఉన్న వారిని ఒక తాటిపైకి తీసుకువచ్చిందుకు ఇలాంటి సదస్సులు ఎంతో దోహదపడుతాయన్నారు. ప్రొ. అడపా సత్యనారాయణ మాట్లాడుతూ 1922 మొట్ట మొదట కుల సంఘం మిదిరాజ్ మహాసభను ఏర్పాటు చేసి కులసంఘాలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కులస్తులు ఇప్పుడు సోయి తెచ్చుకొని ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రొ. నీల రాములు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొ. శ్రీనివాసులు, టిఎస్‌పిఎస్‌సీ మాజీ సలహాదారులు ప్రొ.అడపా సత్యనారాయణ, ప్రొ. సి.దినేష్ ముదిరాజ్, దక్షిణ మధ్యరైల్వే పీఆర్‌వో అనిల్ ముదిరాజ్, కార్పోరేటర్ సామల హేమ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా డా. జూలు నాగేశ్వర్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర యువత అధ్యక్షులు డా. గుండ్ల పల్లి శ్రీనుముదిరాజ్, ప్రధాన కార్యదర్శి అల్లుడు జగన్, సమన్వయ కర్త బొక్క శ్రీనివాస్‌తో పాటు ఓ.యూ డా. కృష్ణ కిషోర్, బోష బోయిన రమేష్ ముదిరాజ్, పెద్దమ్మ రమేష్ ముదిరాజ్, నాగేశ్వర్, జెట్టి శంకర్, ఉమేష్ ముదిరాజ్, మోద రవికాంత్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ గెట్ టుగెదర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త తదితరులు

హైదరాబాద్, నవంబర్ 27, ప్రభాతవార్త: ప్రెస్‌క్లబ్ హైదరాబాద్ గెట్ టుగెదర్ కార్యక్రమం షామీర్‌పేట్‌లోని లియోనియా రిసార్ట్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు జర్నలిస్టుల కుటుంబసభ్యులు ఆడిపాడారు. ఈకార్యక్రమానికి తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ప్రతినిత్యం బిజీగా ఉండే జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఇక్కడ సంతోషంగా గడపడం ఆనందంగా ఉందన్నారు. ఈసందర్భంగా జబర్దస్త్ ఫేం కిరణ్ బలూన్ డాన్సు ఆకట్టుకుంది. ఆలాగే ఫోర్ లెగ్‌డాన్స్, మిమిక్రీ, సర్కస్ వంటి పలు సంస్కృత కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు వేణుగోపాల్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి రవికాంత్‌రెడ్డి, కోశాధికారి రాజేష్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ అభివృద్ధికి నిరంతరం కృషి

**కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ**

కంటోన్మెంట్, నవంబర్ 27 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ తెలిపారు. ఆదివారం 1వ వార్డు సంచారపురి కాలనీలో రూ.19 లక్షలు బోర్డు నిధులతో నాలా నిర్మాణం పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్.కె.మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతోనే కంటోన్మెంట్ బోర్డు పరిధిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తెస్తే తక్షణమే పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బానుక మల్లికార్జున్, బాణాల శ్రీనివాస్ రెడ్డి, చిన్నా, వాహెద్, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## టీఆర్ఎస్ పార్టీ పటిష్టతకు నాయకులు సైనికుల్లా పని చేయాలి

**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.. మణికొండలో భారీ బైక్ ర్యాలీ తీసిన టీఆర్ఎస్ నేతలు**



మణికొండలో జరిగిన టీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, నవంబర్ 27 ప్రభాతవార్త : మణికొండ మున్సిపాలిటీలో టీఆర్ఎస్ పార్టీ పటిష్టతకు నాయకులంతా సైనికుల్లా పని చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం మణికొండ మున్సిపాలిటీలో టీఆర్ఎస్ నాయకులు భారీ బైక్‌ర్యాలీ తీశారు. సభా స్థలి వద్ద టీఆర్ఎస్ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. సీఎం కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి... జై కేసీఆర్ జైజై కేసీఆర్... అంటూ నాయకులు, కార్యకర్తలంతా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. మణికొండలోని రోడ్లన్నీ గులాబీ మయంగా మారాయి. పలువురు యువకులు, మహిళలను గులాబీ కండువాలు కప్పి టీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభ వేదికపై ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కలను సాకారం చేసిన టీఆర్ఎస్ అధికారంలో ఉంటేనే ఈ రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. సామాన్య, మధ్య తరగతి ప్రజల కష్టాలు దగ్గరుండి చూసిన ఉద్యమ నేత, సీఎం కేసీఆర్ నాయకత్వంలో అనతి కాలంలోనే తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. ఎంతో ముందుచూపున్న, దార్శనికుడైన సీఎం చేతిలో మన రాష్ట్రం ఉన్నన్ని రోజులూ తెలంగాణ అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరన్నారు. వరుసగా మూడోసారి తెలంగాణలో అధికారంలోకి వచ్చేందుకు సీఎం కేసీఆర్ ఇప్పటి నుంచే పార్టీ నాయకులు, క్యాడర్‌ను సిద్ధం చేస్తున్నారన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు నాయకులు, కార్యకర్తలంతా మళ్లీ నడుం బిగించాలన్నారు. ప్రతిపక్షాలు చేసే అసత్య ఆరోపణలు తిప్పికొట్టి రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పతకాలను గడప గడపకు తీసుకెళ్లాలని సూచించారు. మనం చేసిన మంచిని చెప్పుకోలేక పోతే ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు వాస్తవమే అని ప్రజలు నమ్మే పరిస్థితి ఉందని, నాయకులంతా అప్రమత్తంగా మెలుగాల్సిన అవసరం ఉందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉద్యోగ, ఉపాధి రంగాలలో తెలంగాణ రాష్ట్రం వేగంగా దూసుకుపోతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి తలారి మల్లేష్ ముదిరాజ్, మణికొండ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి, టీఆర్ఎస్ అధ్యక్షులు బుద్దోలు శ్రీరాములు, నాయకులు యాలాల నరేష్, సాయిరెడ్డి, బషీర్, పి.రూపారెడ్డి, కుమార్ వందలాది మంది టీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

## వడ్డేపల్లి చేరికతో కూకట్‌పల్లిలో బిజెపి మరింత బలోపేతం

**మేడ్చల్ జిల్లా బిజెపి అధ్యక్షులు పన్నాల హరీష్‌రెడ్డి**


పార్టీలో చేరినవారికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బిజెపి శ్రేణులు

కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 27, ప్రభాతవార్త : వడ్డేపల్లి రాజేశ్వరరావు బిజెపిలో చేరడం వల్ల కూకట్‌పల్లి నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం కానుందని మేడ్చల్ జిల్లా బిజెపి అధ్యక్షులు అన్నాల హరీష్‌రెడ్డి పేర్కొన్నారు. అలాగే రాబోయే ఎన్నికల్లో కూకట్‌పల్లి నియోజకవర్గంలో బిజెపి జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. బిజెపి నాయకుడు తిరుమల తిరుపతి దేవస్థానం అడ్వైజరీ కమిటీ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం కూకట్‌పల్లిలోని ఎన్‌కెఎన్ఆర్ గార్డెన్స్‌లో బిజెపి నేతల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు హరీష్‌రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జీ మాధవరం కాంతారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా బిజెపి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని వారు వెల్లడించారు. తెలంగాణ వ్యాప్తంగా యువత బిజెపి వైపు చూస్తోందన్నారు. వడ్డేపల్లి రాజేశ్వరరావు బిజెపిలోకి రావడం వల్ల కూకట్‌పల్లి నియోజకవర్గంలో పార్టీ మరింత పటిష్టం కానుందని వారు స్పష్టం చేశారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గం అభివృద్ధికి తన తండ్రి ఎంతగానో పాటుపడ్డారని, ఆయన ఆశయ సాధనకోసం తాను బిజెపిలో చేరానని, తనకు అవకాశం కల్పించినందుకు కూకట్‌పల్లి నియోజకవర్గంలో బిజెపిని పటిష్టపరిచేందుకు శాయశక్తుల కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఆయా డివిజన్‌లలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు వడ్డేపల్లి రాజేశ్వరరావు నేతృత్వంలో బిజెపి పార్టీలో చేరారు. వారందరికీ బిజెపి నాయకులు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఫతేనగర్‌కు చెందిన అబ్దుల్‌బాకీ, అల్లాపూర్ డివిజన్‌కు చెందిన ప్రవీణ్, కూకట్‌పల్లి కరుణాకర్‌గౌడ్, గోపాలరావు, బాలాజీ నగర్ డివిజన్‌కు చెందిన స్వరూపగౌడ్‌ల ఆధ్వర్యంలో సుమారు 500మంది యువకులు భారీఎత్తున బిజెపిలో చేరారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

నిజాంపేట్, నవంబర్27 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి రెడ్డి అవెన్యూ సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే కేపి వివేకానంద్‌ను తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో ఎస్ఎన్‌డిపి నాలా పనులు, 1డి, 2డిల వద్ద నెలకొన్న వరదనీటి సమస్య పరిష్కకరించాలని ఎమ్మెల్యేను కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో ఫోన్‌లో సంభాషించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గురునాథ్, సెక్రెటరీ సంత్యనారాయణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE 1st SENIOR CIVIL JUDGE-CITY CIVIL COURT:: AT: HYDERABAD
S.O.P.NO.150 OF 2021.

BETWEEN :-
SMT.VADUKA PRASANNA MADHAVI & OTHERS
....PETITIONERS.
AND
HDFC BANK, REP. BY ITS BRANCH MANAGER & ANOTHER
...RESPONDANTS.

To
2). COROMANDEL INTERNATIONAL LIMITED,(FORMERLY COROMANDAL FERTILIZERS LIMITED) REP. BY ITS AUTHORIZED SIGNATORY, REGD. OFF:COROMANDAL HOUSE, 1-2-10, SARDAR PATEL ROAD, SECUNDERABAD-500003.
3). KARVY COMPUTERS SHARE PRIVATE LIMITED CORPORATE OFFICE, PLOT NO.31 & 32, FINANCIALDISTRICT NANAKRAMGUDA, GACHIBOWLI, HYDERABAD-500032.
....RESPONDENT NOS.2 & 3

Take notice that above petition was filed by the Petitioners under Section 372 of Indian Succession Act for succession certificate and the same is posted to **27-12-2022** for your appearance, therefore if anybody having any objection, interest, or claims to be raised before the court as per the law are required to be present either personally or through a Counsel duly instructed on **27-23-2022 at 10.30 A.M**, in case you fail to appear before the Hon'ble Court the above petition will be heard and determined in your absence.
(BY ORDER OF THE HON'BLE COURT)
V.SRINIVAS
T.Nagarjuna (TS/211/2003)
Advocates
R/o.H.No:8-2-268/C/10,Road No.3, Arora Colony,Banjar Hills, Hyderabad-500034.

# ఉప్పల్ సర్కిల్‌లో యధేచ్ఛగా పుట్‌పాత్‌ల ఆక్రమణలు..!

## పుట్‌పాత్‌లపై వ్యాపారాలు : పట్టించుకోని అధికారులు



ఉప్పల్, రామంతాపూర్ రహదారిలో పుట్‌పాత్‌లు ఆక్రమించి ఇసుక కుప్పలు వేసిన దృశ్యం.



రామంతాపూర్ పెద్ద చెరువు ఎదురుగా పుట్‌పాత్ ఆక్రమించి నర్సరీ ఏర్పాటు చేసిన దృశ్యం.

**ఉప్పల్, అక్టోబరు 27 ప్రభాతవార్త :** ఉప్పల్‌సర్కిల్‌లోని పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారుల వెంట ఉన్న పుట్‌పాత్‌లను ఆక్రమించి యధేచ్ఛగా వ్యాపారాలు చేస్తున్నారు. జాతీయ రహదారులపైనే ఆక్రమంగా వ్యాపారాలు సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పుట్‌పాత్ ఆక్రమణల వెంట ఉన్న వ్యాపారుల నుంచి కొందరు కిందిస్థాయి అధికారులు కాసులు దండుకుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ఉప్పల్ రింగ్ రోడ్ నుంచి రామంతాపూర్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఆర్ అండ్‌బి, మున్సిపల్ అధికారులు పుట్‌పాత్‌లు నిర్మించారు. పుట్‌పాత్‌ల వెంట ప్రత్యేకంగా అలంకరించి మొక్కలు కూడా నాటారు. అయితే కొద్ది రోజులకే వీటిని పలు చోట్ల కొందరు ఆక్రమించి ఇసుక, నర్సరీ, ఇతర వ్యాపారాలు చేస్తున్నారు. దీనిపై పోలీసులు, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఇసుక, నర్సరీ వ్యాపారుల దందా మూడు పువ్వులు, ఆరుకాయలుగా కొనసాగుతోంది. ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి రామంతాపూర్‌కు వెళ్లే రహదారిలో అనుమతికి విరుద్ధంగా కొందరు ఇసుక వ్యాపారులు రోడ్డుపైనే ఇసుక వేసి వ్యాపారం చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. నడిరోడ్డును ఆక్రమించి లారీలు రోడ్డుపై నిలిపి ఉంచినా అధికారులు దీనిపై చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. పుట్‌పాత్‌లు నిర్మించి తిరిగి వాటి నిర్వహణ పట్టించుకోని అధికారులు వాటిని దుర్వినియోగం చేస్తున్నా దీనిపై శ్రద్ధ తీసుకోకపోవడంపై పలువురు విమర్శలు చేస్తున్నారు. రోడ్డుకు సుమారు ఐదు కిమీ పరిధిలో ఇసుక, కంకర, ఇతర వస్తువులు పుట్‌పాత్‌లపై వేసి విక్రయాలు చేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు.

**పుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారుల దందా..!**

రామంతాపూర్ ప్రధాన రహదారిలో పలు చోట్ల పుట్‌పాత్‌లు ఆక్రమించి పలు వ్యాపారాలు చేస్తున్నారు. నిత్యం ఈ దారిలో తిరిగే ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా దీనిపై దృష్టి కేంద్రీకరించకపోవడంపై పలు అనుమానాలు వస్తున్నాయి. కొందరు కింది స్థాయి సిబ్బంది ఇసుక, కంకర, నర్సరీ వ్యాపారుల నుంచి ప్రతి నెలా మామూళ్లు వసూళ్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. పుట్‌పాత్‌లు ఆక్రమించడం వల్ల దీనిపై నడిచేందుకు వీలు లేకుండా తయారైంది. ఉన్నతాధికారులు స్పందించి దీనిపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# పారిశ్రామిక రంగ అభివృద్ధికి ఎంఎస్ఎంఈల వృద్ధి అవసరం



పారిశ్రామిక ప్రదర్శనలు ప్రారంభిస్తున్న నారాయణమూర్తి

**కుషాయిగూడ, నవంబర్ 26 ప్రభాతవార్త :** కేంద్ర పారిశ్రామిక వ్యవస్థ అభివృద్ధి చెందాలంటే ఎలా పరిశ్రమలు ముందుగా వృద్ధి చెందాల్సిన అవసరం ఎంతో ఉందని టీఆర్డీఓ డైరెక్టర్ జనరల్ నారాయణమూర్తి పేర్కొన్నారు. చర్లపల్లి పారిశ్రామిక వాడలో సూక్ష్మ చిన్న మధ్య తరహాల పరిశ్రమల అభివృద్ధి కోసం ఏర్పాటుచేసిన ప్రదర్శన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎంఈలు అభివృద్ధి చెందడానికి ఇలాంటి ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయన్నారు. చర్లపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్, ఎంఎస్ఎంఎస్ డెవలప్మెంట్ ఫెసిలిటేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ ప్రదర్శనలో ఈసీఐఎల్ రైల్వే ఎంఎస్‌సి, బిహెచ్ఈఎల్, బిఎల్, బిడిఎల్, హెచ్ఏఎల్ ప్రధాని డిఆర్డిఓ ఎన్ఎండీసీ సిసిఐ వంటి ప్రభుత్వ రంగ పరిశ్రమలు తమ భారీప్రదర్శనలు ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెస్ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్ అసిస్టెంట్ డైరెక్టర్ శివరాం ప్రసాద్ పారిశ్రామికవేత్తల సమాఖ్య అధ్యక్షులు కొండేటి సుధీర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపాల్ రావు, సన్యాస్ అసోసియేషన్ అధ్యక్షులు రోషిరెడ్డి, సిఐఏ అధ్యక్షులు డాక్టర్ గోవిందారెడ్డి, పారిశ్రామికవేత్తలు వెంకటేశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి విశ్వేశ్వర్‌రావ్, జలంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : కార్పొరేటర్ మీనా ఉపేందర్‌రెడ్డి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మీనాఉపేందర్‌రెడ్డి

**నేరెడ్‌మెట్, నవంబర్ 27 ప్రభాతవార్త:** ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నేరెడ్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని డిఫెన్స్‌కాలనీలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత యాంత్రిక యుగంలో ప్రజలు చెడు అలవాట్లకు గురై శరీరంపై శ్రద్ధ చూపిడంలో జాప్యం వహించడం జరుగుతుందన్నారు. దాని కారణంగా వింత రోగాల బారిన పడి తమ ప్రాణాలను సైతం పోగొట్టుకున్న వారు ఉన్నారు. వాటిలో దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు నెలకు ఒక్కసారైనా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. సుమారు 250 మంది వరకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి, సారధి, కెవి రావు, చెన్నారెడ్డి, శివ, లయన్స్ క్లబ్ సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# హబ్సిగూడ డివిజన్ రెడ్డి సంఘం నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన హబ్సిగూడ రెడ్డి సంఘం సభ్యులు

**ఉప్పల్, నవంబర్ 27 ప్రభాతవార్త:** హబ్సిగూడ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏన్నుకున్నారు. సంఘం అధ్యక్షులుగా గాయం శ్రీధర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా గూడూరు నరోత్తంరెడ్డి, జనరల్ సెక్రెటరీగా గడ్డం మదుసూధన్‌రెడ్డి, కోశాధికారిగా గడ్డం సుధాకర్‌రెడ్డి, గౌరవ సలహాదారులుగా కాటేపల్లి ప్రతాప్‌రెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యక్షులుగా ఏన్నుకోబడ్డారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారిని హబ్సిగూడ రెడ్డి సంఘం సభ్యులు అభినందనలు తెలిపారు.

# సీనియర్ సిటిజన్లకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**ఎల్.బి.నగర్, నవంబర్ 27 ప్రభాతవార్త:** సీనియర్ సిటిజన్ల అభ్యున్నతికోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. చైతన్యపురి డివిజన్ పరిధిలోని ద్వారకాపురం సీనియర్ సిటిజన్స్ సేవా సమితి ఏడవ వార్షికోత్సవ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందన్నారు. అభివృద్ధి విషయంలో సీనియర్ సిటిజన్లు తమ సలహాలు, సూచనలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగ నర్సింహగుప్తా, అధ్యక్షులు ప్రసాద్, తెరాస నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి పానకాలరావు, కోశాధికారి శ్రీనివాసరావు, సిటిజెన్లు నారాయణరావు, సత్యనారాయణ, సంతోష్ యాదవ్, తులసికృష్ణ, కృష్ణ, జలంధర్, కిరణ్ పాల్గొన్నారు.

# నిజాం దురాగతాలను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలి: చలమారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చెలమరెడ్డి తదితరులు

**ఎల్.బి.నగర్, నవంబర్ 27 ప్రభాతవార్త:** నిజాం అరాచకాల గురించి పాఠ్య పుస్తకాలను చేర్చాల్సిన అవసరం ఉందని స్ఫూర్తి ఇన్‌స్టిట్యూషన్ చైర్మన్ చలమారెడ్డి పేర్కొన్నారు. నైజాం విముక్త స్వాతంత్ర అమృత్సవ సమితి దిల్ సుఖ్ నగర్ బాగ్ ఆధ్వర్యంలో ఆదివారం నాగోల్ శుభం కన్వెన్షన్ సెంటర్‌లో యువసమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ నిజాం దురాగతాలు పాఠ్యాంశాలలో ఎక్కడ లేకపోవడం వల్ల నేటి విద్యార్థులకు తెలుసుకునే అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే తరాలకు తెలియజేయాలంటే ఇటువంటి చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాల్సిందిగా విజ్ఞప్తిచేశారు. ఆర్ఎస్ఎస్‌ప్రాంత భౌతిక ప్రముఖ్ జయదేవ్ మాట్లాడుతూ నిజాం కాలంలో జరిగినటువంటి ఆకృత్యాలు సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గురించి వివరించారు. ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్ మాట్లాడుతూ స్వామి వివేకానందవంటి మహాపురుషుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని నేటి యువత సమాజ నిర్మాణం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వందలాది యువతీ, యువకులు పాల్గొన్నారు.

# యువత వృత్తి రీత్య స్థిరపడి స్ఫూర్తినందించాలి : మంత్రి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సబితారెడ్డి తదితరులు

**వనస్థలిపురం, నవంబర్ 27 ప్రభాతవార్త:** యు5ఎ క్రియేటివ్ మల్టీమీడియా గ్రూప్ 20వ వార్షికోత్సవం సందర్భంగా యు5ఎ చిహ్నంతో వారు రూపొందించిన 2023 సంవత్సర క్యాలెండర్‌ను విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్థ చైర్మన్ సి. హెచ్.శ్రీనివాస్ గత 20 సంవత్సరములుగా మన దేశంతోపాటు, విదేశాలలో కూడా మంచి పనితనంతో వినియోగదారులను సంపాదించుకొని అత్యున్నత ప్రమాణాలతో అంతర్జాతీయ స్థాయిలో సేవలందించి మంచి పేరు ప్రఖ్యాతలు గడించారని ఆమె ప్రశంసించారు. సృజనాత్మకత రంగం వారి అవసరాలు వ్యాపార, వాణిజ్య రంగాల్లో ఉన్న ప్రతిఒక్కరికి ఉంటుందని యువత ఆ రంగంలో కూడా వృత్తి రీత్య స్థిరపడి ఎంతో మందికి స్ఫూర్తినందించాలి తెలిపారు.

# తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



క్రీడాకారులతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నాగరాజు తదితరులు

**వనస్థలిపురం, నవంబర్ 27 ప్రభాతవార్త:** క్రీడలలో ఉత్తమ కనబరిచి తెలంగాణకు మంచి పేరు తీసుకురావాలని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. వనస్థలిపురంలోని ఏ టైప్ క్వార్టర్స్‌లో నూతనంగా నిర్మించిన రోలర్ స్కేటింగ్ రింక్ గ్రౌండ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ బాలబాలికలు ఎంచుకున్న రంగాల్లో రాణించి జాతీయస్థాయి పోటీలలో పాల్గొని రాష్ట్రానికి పేరు తీసుకురావాలన్నారు. రాష్ట్రప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యతనిస్తుందన్నారు. బెంగళూరులో జరగబోయే నేషనల్ ఇన్‌లైన్ హాకీకి ఎంపికైన బాలబాలికలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షుడు చింతల రవికుమార్, నాయకులు దూసరి మధుగౌడ్, కొలిశెట్టి సంజయ్‌కుమార్, ఆనంద్‌రాజ్, మదన్‌మోహన్‌రెడ్డి, నిర్మల్‌సింగ్, ప్రేమ్‌రాజ్, మహేందర్, కోచ్‌లు యాదయ్య, శ్రీనివాస్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి వైపు ఆకర్షితులవుతున్న యువత : అందెల శ్రీరాములుయాదవ్



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న అందెల

**సరూర్‌నగర్, నవంబర్ 27 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో యువత బిజెపి వైపు ఆకర్షితులవుతున్నారని నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. ఆదివారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 32 డివిజన్ల నుండి పెద్ద సంఖ్యలో యువత అందెల సమక్షంలో బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందెల వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు భృతిచెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సామ సంజీవరెడ్డి, నడికుడ యాదగిరి, గుర్రం మల్లారెడ్డి, చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, తోట శ్రీధర్‌రెడ్డి, రామోజీ అమిత శ్రీశైలంచారి, పెత్తుల్ల పుల్లారెడ్డి, రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, పోరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, నిమ్మల రవికాంత్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయం



వైద్య శిబిరంలో మందులను అందిస్తున్న దండెం రాంరెడ్డి

**హయత్‌నగర్, నవంబరు 27 ప్రభాతవార్త:** పేద, మధ్యతరగతి ప్రజల సౌకర్యార్థం సామాజిక బాధ్యతగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి అన్నారు. దండెం యాదమ్మ, నారాయణరెడ్డిల జ్ఞాపకార్థం వారి కుమారులు దండెం నర్సింహారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి దండెం రాంరెడ్డి, కౌన్సిలర్ దండెం కృష్ణారెడ్డిలు ఆదివారం ఓమ్నీ ఆసుపత్రి సౌజన్యంతో పెద్దఅంబర్‌పేట జడ్పీహెచ్ఎస్‌లో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ప్రారంభించిన రాంరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పేదలకు సేవచేయాలన్న లక్ష్యంతో వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు వివరించారు. శిబిరంలో చిన్నారులు, మహిళలు, వృద్ధులకు వైద్యులు జనరల్ చెకప్‌తో పాటు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించారు. వైద్యపరీక్షలకు హాజరైన వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సదుపాయాలను కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు సందీప్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రితిక్, అఖిల్, మణికంఠరాజు, అష్నా, శ్రావణి, కౌన్సిలర్లు సిద్ధంకి కృష్ణారెడ్డి, విద్యావతి విజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అనుపమ సుప్రసేన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 18 వ పడి జన్మయోగం : గురు స్వామి బైరి భాస్కర్ గౌడ్

**కుషాయిగూడ, నవంబర్ 26 ప్రభాతవార్త :** 18వ పడి గురుస్వామి వరకు చేరుకోవడం పూర్వజన్మ యోగమని ఎల్లారెడ్డిగూడ అయ్యప్ప స్వామి భక్త బృందం వ్యవస్థాపక చైర్మన్ టిఆర్ఎస్ పార్టీ మీడియాస్ అధ్యక్షులు బైరి భాస్కర్‌గౌడ్ గురుస్వామి పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని ఎల్లారెడ్డిగూడా గ్రామంలో ముదిగొండ పాండు గురుస్వామి 18 వ పడిపూజ భాస్కర్‌గౌడ్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలపాటు అయ్యప్ప స్వామి దీక్ష చేయడం అనేది తెలివితో డబ్బుతో సాధ్యం పడదన్నారు. అది కచ్చితంగా పూర్వజన్మ సుకృతం యోగం అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ కౌన్సిలర్ కొత్త రామారావు, కాసం మహిపాల్ రెడ్డి, గురుస్వాములు వడ్లోజు జ్యోతిర్మయ చారి, మాడిశెట్టి సుదర్శన్, నాగరాజు గుప్త తదితరులు పాల్గొన్నారు.

# నాదర్‌గుల్‌లో ఘనంగా అయ్యప్ప మహా పడి పూజ

**సరూర్‌నగర్, నవంబర్ 27 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌గ్రామంలో ఆదివారం అయ్యప్ప మహా పడిపూజ ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి 18వ సారి మాలధారణ చేసిన సందర్భంగా తోట యెట్టారెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించిన మహాపడి పూజకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి హాజరై పూజలు చేశారు. అదే విధంగా రాష్ట్ర బిజెపికార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం బిజెపిఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ కూడా పడి పూజకు హాజరై పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్‌లకు చెందిన నాయకులు స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అభివృద్ధిని చూసి పార్టీలో చేరికలు:మంత్రి సబిత



మంత్రి సబితారెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

**ఎల్.బి.నగర్, నవంబర్ 27 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి పలు పార్టీలకు చెందిన నాయకులు టిఆర్ఎస్ లో చేరుతున్నారని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. సరూర్ నగర్ డివిజన్‌లోని చెరుకుతోట కాలనీ, పోచమ్మ బస్తికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం అల్లంపల్లి రాకేష్, నారపాక శంకర్, చిరంజీవి, దాసరోల యాదయ్య, బండారి ప్రవీణ్ కుమార్, నరేష్ కిషోర్, పరమేష్, చందు, ఉమా, సాయి, శ్రీనివాస్, జగదీష్, సాగర్, తదితరులు మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో టిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నాయకత్వాన్ని బలపరుస్తూ తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని పెద్ద ఎత్తున టిఆర్ఎస్ పార్టీకి ప్రజలు మద్దతు పలుకుతున్నారని తెలిపారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సిఎం కేసీఆర్ నాయకత్వంలో అనేక ప్రజా సంక్షేమపథకాలు ప్రవేశ పెడుతున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కాంగ్రెస్ కార్యకర్తలు టిఆర్ఎస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న మంత్రి సబితారెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 27 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్ బాలాపూర్‌గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు ఆదివారం టిఆర్ఎస్ పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన బడంగ్‌పేట్‌కార్పొరేషన్ కో-ఆప్షన్ సభ్యుడు గుండోజు రఘునందనచారి, సీనియర్ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, అత్తాపురం శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మని గిరీష్‌ల ఆధ్వర్యంలో కాంగ్రెస్‌కు చెందిన పలువురుకార్యకర్తలు మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో గులాబి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కొప్పుల రాజు, అల్వాల్‌రెడ్డి, కోటగిరి మురళి, హరిగౌడ్, గోపాల్ నాయక్, యాదగిరి, క్యారగారి ప్రవీణ్, బద్రి నాయక్, నరహరి, అనిల్, శ్రీశైలం, సాయిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్వరం అసెంబ్లీ టిఆర్ఎస్ ఉపాధ్యక్షునిగా నరేందర్‌గౌడ్

**సరూర్‌నగర్, నవంబర్ 27 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గ టిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షునిగా మామిడిపల్లి గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నిమ్మల నరేందర్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు విద్యాశాఖమంత్రి, పి.సబితా ఇంద్రారెడ్డి నరేందర్‌గౌడ్‌ను నియోజకవర్గ పార్టీ వైస్ ప్రెసిడెంట్‌గా నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ పదవిలో నియమించిన సబితారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లెల కృష్ణారెడ్డి, అర్కల భూపాల్‌రెడ్డి, సూర్ణగంటి అర్జున్, వేముల నర్సింహ, బొర్ర జగన్‌రెడ్డి, లిక్కి కృష్ణారెడ్డి, ఏనుగు రాంరెడ్డి, సుక్క శివకుమార్, గుండోజు రఘునందనచారి, వంగేటి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నందిహిల్స్ ఫేజ్-2 అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు

**సరూర్‌నగర్, నవంబర్ 27 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని నందిహిల్స్ కాలనీ ఫేజ్-2 రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఆదివారం కాలనీలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు అధ్యక్షునిగా సిద్దప్ప, కార్యదర్శిగా యాదగిరిరెడ్డి, ఉపాధ్యక్షులుగా సురేష్ గుప్త, లింగారెడ్డి, సాయిలు, సాయి ప్రసాద్, కోశాధికారిగా అంతయ్య, సహాయ కార్యదర్శిగా గోపాల్ యాదవ్, సహాయ కార్యదర్శిగా గణేష్, కార్యనిర్వాహక కార్యదర్శిగా రమేష్ గుప్త, ఆడిటర్‌గా రమేష్ బాబులు ఎన్నికయ్యారు.

# జిల్లెలగూడ శివసాయినగర్ కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం

**సరూర్‌నగర్, నవంబర్ 27 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ కర్మన్‌ఘాట్ శివసాయినగర్ కాలనీ అధ్యక్షునిగా వై.గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సి.గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారిగా టి.రాధాకృష్ణ, ఉపాధ్యక్షులుగా కె.గంగాధర్, సంయుక్త కార్యదర్శులుగా మాధవరెడ్డి, రమేష్ గుప్త, కార్యవర్గ సభ్యులుగా డి.చంద్రశేఖర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, రజనీకుమార్‌లు ఎన్నికయ్యారు. కాలనీలో జరిగిన సర్వ సభ్య సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# పేదలకు కెఎంఆర్ ఇంటి పట్టాల పంపిణి



పేదలకు ఇంటి పట్టాలు అందజేస్తున్న కొత్త మనోహర్‌రెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 27 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో ఇళ్లు లేని పలువురు పేదలకు నియోజకవర్గ టిఆర్ఎస్ పార్టీ నాయకుడు, కెఎంఆర్ ట్రస్ట్ ఛైర్మన్ కొత్త మనోహర్‌రెడ్డి ఆమన్‌గల్ సమీపంలోని తన స్వంత భూమిలో 60 గజాల పట్టాలను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని ఘట్టుపల్లి గ్రామానికి చెందిన నిరుపేదలకు జి.యాదమ్మ, ఎ.పద్మమ్మ, ఎం.చంద్రమ్మ, బి.పద్మమ్మ, జి.పద్మమ్మ, కె.అంజమ్మలకు ఆదివారం పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా పట్టాలు తీసుకున్న వారు కొత్త మనోహర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# కూచిపూడిలో చిన్నారి కృష్ణయుక్తకు గౌతమ్ బుద్ధ నేషనల్ పీస్ అవార్డు




మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఛైర్మన్ శ్రీనివాస్‌గుప్త చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కృష్ణయుక్త

**వనస్థలిపురం, నవంబర్ 27 ప్రభాతవార్త:** వనస్థలిపురంకు చెందిన చిన్నారి గంధం కృష్ణయుక్త గౌతమ్ బుద్ద నేషనల్ పీస్ అవార్డుకు ఎంపికైంది. కూచిపూడి నృత్య విభాగంలో తక్కువసమయంలో ఎక్కువ ప్రదర్శనలిచ్చి నైపుణ్యం సాధించినందుకు ఈ అవార్డు లభించింది. గోల్డెన్ స్టార్ యూత్ కల్చరల్ ఆర్గనైజేషన్ సారధ్యంలో నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో డాక్టర్ ఎన్టీఆర్ కళావేదికపై జరిగిన కార్యక్రమంలో మాజీ స్పీకర్ సిరిగొండ మధుసూదనాచారి, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త చేతుల మీదుగా కృష్ణయుక్త గౌతమ బుద్ద నేషనల్ పీస్ అవార్డును అందుకుంది. వనస్థలిపురంలోని డాక్టర్ గంధం శాంతికుమార్,వాసవి ప్రసన్నల కుమార్తె కృష్ణయుక్త జాన్సన్ గ్రామర్ స్కూల్‌లో 2వతరగతి చదువుతుంది. 8ఏళ్లవయస్సులోనే 18 నెలల కాలంలో పలు అద్భుతమైన కూచిపూడి నృత్యాలను నేరుకుని వివిధ కార్యక్రమాల్లో పాల్గొని ఎన్నో అవార్డులు సాధించింది. కృష్ణయుక్త కూచిపూడి నాట్యాలయంలో మాదాల కృష్ణప్రియ వద్ద శిక్షణ పొందింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి వేణుగోపాలచారి, సినీనటుడు సుమన్‌గౌడ్, బింగి నరేందర్‌గౌడ్, జస్మత్ బాయ్ తదితరులు పాల్గొన్నారు.

# రమేష్ గౌడ్ ఔదార్యం భేష్ : మాజీ ఎంపీ పొన్నం



పొన్నం ప్రభాకర్‌కు విరాళం అందిస్తున్న ఎర్ర రమేష్‌గౌడ్

**కుషాయిగూడ, నవంబర్ 26 ప్రభాతవార్త :** మాజీ కౌన్సిలర్ ఎర్ర రమేష్ గౌడ్ సౌదర్యం గొప్పది అని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్ పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ చెందిన కాప్రా మాజీ కౌన్సిలర్ ఎర్ర రమేష్ గౌడ్ దంపతులు శ్రీ రాజరాజేశ్వర గౌడ్ చారిటబుల్ ట్రస్ట్ వారికి లక్ష రూపాయల విరాళాన్ని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్ చేతుల మీదుగా ట్రస్ట్ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవ చేసే గుణం ఉన్న వాడే గొప్ప ధనవంతుడని అలాంటి గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. రమేష్‌గౌడ్ కుటుంబం గత 30 సంవత్సరాలుగా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ నిరుపేదలను ఆదుకోవడం అభినందనీయమన్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే తమ లక్ష్యమని రమేష్‌గౌడ్ దంపతులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# 18సంలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందాలి : సురేష్



ఓటరు నమోదు కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు

**నేరెడ్‌మెట్, నవంబర్ 27 ప్రభాతవార్త:** 18సంలు నిండిన ప్రతిఒక్కరు తమ పేరును ఓటరు కార్డులో నమోదు చేసుకోవాలని వినాయక్‌నగర్ డివిజన్ అధ్యక్షులు తులసి సురేష్ పేర్కొన్నారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు ఆదేశానుసారం ఆదివారం వినాయక్‌నగర్ డివిజన్‌లో నాయకులతో కలసి ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మంచి పాలన అందించడంలో ఓటరు ముఖ్యమైన వ్యక్తి అని తెలిపారు. దేశ రాజకీయాల్లో మార్పు రావాలంటే కేవలం ఓటరుతోనే సాధ్యమన్నారు. 18సంలు నిండిన ప్రతి ఒక్కరు తప్పకుండా తమ పేరును ఓటరు కార్డులో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ అధ్యక్షులు పిట్ల శ్రీనివాస్, చంద్రకాంత్, కరీంభాయ్, యాదగిరి, ధరణ్, నర్సింగ్ రావు, ఓటరు నమోదు సిబ్బంది ఆర్‌పి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటియుసి మహాసభలకు తరలిన కార్మిక నాయకులు




జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న యాదయ్య తదితరులు

**తుర్కయంజాల్, నవంబర్ 27 ప్రభాతవార్త:** భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో నవంబర్ 27నుండి 29 వరకు జరుగుతున్న ఏఐటియుసి తెలంగాణ 3వ రాష్ట్ర మహాసభల సందర్భంగా బహిరంగ సభ, భారీ ప్రదర్శనకు తుర్కయంజాల్ మున్సిపాలిటీనుండి బయలుదేరిన కార్మికుల బస్సుకు ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి యాదయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓరుగంటి మాట్లాడుతూ యాదగిరిగుట్టలో జరుగుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు జయప్రదం కావాలని ఆకాంక్షించారు. అన్నితరగతుల కార్మికులసమస్యలు పరిష్కారం కోసం మహాసభలో చర్చించబోతున్నామని పేర్కొన్నారు. ఈ మహాసభల సందర్భంగా కార్మికులకు కనీస వేతనం 26వేలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.